క్లుప్తంగా

తెనాలి మున్సిపల్ కమిషనర్‌గా చల్లా ఓబులేసు



తెనాలిఅర్బన్: పట్టణ మున్సిపల్ కమిషనర్‌గా చల్లా ఓబులేసు నియమితులయ్యారు. ఈ మేరకు మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వస్తున్నారు. ఆయన గతంలో కొవ్వూరు, తుని, రామచంద్రపురం, గుంతకల్లు, శ్రీకాకుళం కార్పొరేషన్‌లో కమిషనర్‌గా పనిచేశారు. 2005లో తుని మున్సిపాలిటీ పరిధిలో జరిగిన ఎన్నికల్లో 30 నిమిషాల్లో రిజల్ట్‌ను ప్రకటించి రికార్డు సాధించారు. అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం ఆయనకు అవార్డు అందజేసింది. ఇక్కడ పనిచేస్తున్న బండి శేషన్న బదిలీపై నంద్యాల మున్సిపల్ కార్పొరేషన్‌కు వెళ్లనున్నారు. రెండు రోజుల్లో ఓబులేసు విధుల్లో చేరే అవకాశం ఉంది. అలాగే మున్సిపల్ ఇంజినీర్‌గా సెలవులో ఉన్న పి.శ్రీకాంత్ తెనాలి రానున్నారు. మార్కాపురం మున్సిపాలిటీలో డీఈగా పనిచేస్తున్న ఎ.శ్రీనివాసులు బదిలీపై తెనాలి వస్తున్నారు. వీటికి సంబంధించిన ఉత్తర్వులను ప్రిన్సిపల్ సెక్రటరీ జారీ చేశారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

మంత్రి నాదెండ్ల మనోహర్



తెనాలిటౌన్: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బాధిత కుటుంబాలకు జనసేన పార్టీ అండగా ఉంటుందని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. మంగళవారం రూరల్ మండలం ఖాజీపేట గ్రామంలో గమిడి ఏడుకొండలు, వెలివెల మహేష్‌బాబు కుటుంబాలకు చేరో రూ.5లక్షలు చొప్పున బీమా చెక్కులను మంత్రి మనోహర్ అందజేశారు. రోడ్డు ప్రమాదంలో జనసేన కార్యకర్తలు అయిన ఏడుకొండలు, మహేష్‌బాబు ఇటీవల మృతి చెందినట్లు తెలిపారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు బాధిత కుటుంబాలకు భీమా పరిహారం అందించినట్లు వెల్లడించారు. ఆయా కుటుంబాలకు పార్టీ తరపున అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో గాదె వెంకటేశ్వరరావు, పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర మహాసభల్లో పాల్గొనాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్



తెనాలిఅర్బన్: సీపీఐ ఆధ్వర్యంలో ఆగస్టు 20 నుంచి 25 వరకు ఒంగోలులో జరగనున్న రాష్ట్ర మహాసభల్లో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలోని ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన దగ్గర నుంచి పేదలకు తీవ్ర అన్యాయం జరగుతుందన్నారు. పెట్రోలు, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం 100 రోజుల్లో నిత్యావసర ధరలు తగ్గిస్తామని, ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. దానిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో కులాలు, మతాల మధ్య ప్రధాని మోడీ ప్రభుత్వం చిచ్చుపెడుతోందని ఆరోపించారు. ప్రజలందరూ ఏకతాటిపైకి వచ్చి ఉద్యమానికి సిద్ధపడాలని కోరారు. సమావేశంలో జిల్లా నాయకులు మేడా హనుమంతరావు, తెనాలి నియోజకవర్గ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, పట్టణ కార్యదర్శి మద్దినేని కిరణ్ బాబు, కొల్లిపర మండల కార్యదర్శి తుంగా బాలస్వామి, ఏఐఎస్‌ఎఫ్ నాయకులు పాశం వెంకటేష్, గుండు శివ, కోలా శేఖర్, అఖిల్‌పవన్, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని పెనుమాక వందేమాతరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బాల బాలికలకు వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ శిరోమణి మాట్లాడుతూ.. నేటికీ పలు ప్రాంతాల్లో బాల్య వివాహ లు జరుగుతుండడం విచారకరమన్నారు. బాల్య వివాహాలు జరిగితే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. బాల్య వివాహాల వల్ల మహిళల్లో అనేక సమస్యలు వస్తాయని వివరించారు. కార్యక్రమంలో చైల్డ్ రైట్స్ అధికారి చిన్ని కోటేశ్వరరావు, పెనుమాక మహిళా పోలీస్ అరుణిమ, కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు సరళకుమారి, కిరణ్మయి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆరంభించారు.. ఆదమరిచారు!

- తెనాలిలో మళ్లీ మొదటికి వచ్చిన ప్లాస్టిక్ విక్రయాలు
- అన్ని దుకాణాలు, తోపుడు బళ్లపై దర్శనమిస్తున్న ప్లాస్టిక్ కవర్లు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



ప్లాస్టిక్ కవర్‌లో అరటికాయలు వేస్తున్న చిరు వ్యాపారి

తెనాలిఅర్బన్: పట్టణంలో ప్లాస్టిక్ వస్తువుల విక్రయాలకు అడ్డాగా మారుతోంది. 120 మైక్రాన్‌ల తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ వస్తువులు, కవర్లు వినియోగించవద్దని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించినా వాటి విక్రయాలు మాత్రం ఆగటం లేదు. గుర్తు వచ్చినప్పుడు మున్సిపల్ అధికారులు హడావిడి చేయడం.. తర్వాత ఆ ఊసే లేకపోవటం పరిపాటిగా మారుతోంది. దీంతో మళ్లీ తెనాలిలో వీటి విక్రయాలు–వినియోగం పెరిగిందని చెప్పవచ్చు. తెనాలి పట్టణంలో సుమారు రెండు లక్షల జనాభా ఉంటారు. వీరు కాకుండా గ్రామీణ ప్రాంతాల నుంచి ఇక్కడికి ప్రతిరోజు సుమారు 10 వేల మంది వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. ఇక్కడ ప్లాస్టిక్ కవర్లు, వస్తువులు హోల్ సెల్‌గా విక్రయించే షాపులు సుమారు 8 వరకు ఉంటాయి. వీరు చెన్నై, హైదరాబాద్‌ల నుంచి ఎక్కువగా తక్కువ మందంగా కలిగిన ప్లాస్టిక్ కవర్లు, వస్తువులు తెప్పించి విక్రయిస్తుంటారు. వీరి నుంచి పట్టణంలో ఉన్న సుమారు అయిదు వేల మంది దుకాణదారులు, చిరు వ్యాపారులు వాటిని కొనుగోలు చేసి విక్రయిస్తుంటారు. వీటిని ప్రజలు ఉపయోగిస్తుంటారు.

సుప్రీం ఆదేశాల అమలేది.. అమలు చేయని అధికారులు

120 మైక్రాన్‌ల తక్కువ మందం ఉన్న వస్తువులు, కవర్ల వినియోగం వల్ల అనేక అనర్థాలు ఉన్నాయని, వాటిని ఎవరు విక్రయించకుండా, ఉపయోగించకుండా చూడాలని ప్రభుత్వాలకు దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. మార్చి నెలలో స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ అధికారులు పట్టణంలోని అన్ని హోల్ సెల్ షాపులపై దాడులు చేసి వాటి విక్రయాలను ఆపివేయాలని ఆదేశించారు. అలాగే తోపుడుబండ్లు, చిరు వ్యాపారుల వద్దకు వెళ్లి తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే రూ.అయిదు వేల అపరాధ రుసుం విధిస్తామని హెచ్చరించారు. దీంతో వారు విక్రయాలను కొద్దిరోజులు నిలిపివేశారు. అలాగే మార్చినెలలో ప్లాస్టిక్ వస్తువుల సేకరణను నిర్వహించగా 775 కేజీల ప్లాస్టిక్ వస్తువులు, కవర్లను ప్రజలు వారికి అందజేశారు. ఆతర్వాత కొద్ది రోజులకే దాని ఊసే మరిచారు. దీంతో తెనాలి పట్టణంలో ఎక్కడ చూసిన తక్కువ మందంగా కలిగిన ప్లాస్టిక్ కవర్ల వినియోగం కన్పిస్తోంది.



ప్లాస్టిక్ కవర్‌లతో వస్తువులను తీసుకు వెళ్తున్న మహిళలు



వాహనాల ముందు వస్తువులతో ఉన్న ప్లాస్టిక్ కవర్లు

ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలు ఇవి.

- పర్యావరణంపై దృష ప్రభావం.. ప్లాస్టిక్ కచ్చితంగా కరుగదు. ఇది వందల సంవత్సరాలు నేలలో ఉంటు భూమిని కలుషితం చేస్తుంది.
- వాతావారణ కలుషితం...ప్లాస్టిక్ తయారీకి పెట్రోలియం ఉత్పత్తులను ఉపయోగిస్తారు. ఇవి గాలి కాలుష్యాన్ని పెంచుతాయి.
- జంతువులకు హాని.. రోడ్లపై, సముద్రంలో ప్లాస్టిక్‌ను పడేయటం వల్ల పశువులు, జలచరాలు దీన్ని తిని మరణించే అవకాశం ఉంది.
- మట్టి నాణ్యత తగ్గింపు.. మట్టిలో కరగకుండా ప్లాస్టిక్ అలా ఉండటం వల్ల దానిలో నాణ్యత తగ్గే అవకాశం ఉంది. పంటల దిగుబడి తగ్గే అవకాశం ఉంది.
- డ్రైనేజ్ సమస్య... ప్లాస్టిక్ వస్తువులను మురుగు కాల్వల్లో వేయటం వల్ల నీరు కలుషితం అయ్యే అవకాశం ఉంది. అలాగే కాల్వల్లో పారుదల లేకుండా అడ్డుపడతాయి. వరదలకు ఇవి కారణంగా మారతాయి.
- మానవ ఆరోగ్యంపై ప్రభావం..ప్లాస్టిక్ మైక్రో పార్టికల్స్ ఆహారం, నీటి ద్వారా మన శరీరంలోకి వెళ్తే ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అలాగే క్యాన్సర్ వచ్చేందుకు ఇదికూడా ఒక కారణంగా చెప్పవచ్చు. ఇన్ని దుష్పరిణామాలు ఉన్న నేపథ్యంలో అందరు వీటికి దూరంగా ఉంటే భవిష్యత్ తరాలకు మేలు చేసిన వారం అవుతాము. ఆ దిశగా ప్రభుత్వాలు, అధికారులు అడుగులు వేయాల్సిన అవసరం ఉంది.

నాలుగు ప్రత్యేక బృందాలు ఏర్పాటు



ప్లాస్టిక్ రహిత తెనాలిగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. హోల్‌సెల్ షాపులపై దాడులు చేసి పెద్ద మొత్తంలో అపరాధ రుసుం విధిస్తున్నాం. ప్లాస్టిక్ విక్రయాలు, వినియోగాన్ని అరికట్టేందుకు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. వారితో 120 మైక్రాన్‌లలోపు మందం ఉన్న ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలందరు సహకరించాలి.

– వీఎం లక్ష్మీపతిరావు, అసిస్టెంట్ కమిషనర్, తెనాలి పురపాలక సంఘం

రేపు తెనాలిలో డాక్టర్ వెలగా కాంస్య విగ్రహావిష్కరణ



తెనాలి: పట్టణానికి చెందిన గ్రంథాలయోద్యమ ప్రముఖుడు డాక్టర్ వెలగా వెంకటప్పయ్య కాంస్య విగ్రహాన్ని ఈనెల 12న తెనాలి బండ్‌పై ఆవిష్కరించనున్నారు. ఆరోజు ఉదయం 10 గంటలకు జరిగే విగ్రహావిష్కరణ సభకు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అధ్యక్షత వహిస్తారు. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్యఅతిథులుగా హాజరవుతారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, పారిశ్రామికవేత్త కొత్త సుబ్రహ్మణ్యం, లంకా సూర్యనారాయణ, డాక్టర్ బీరం సుందరరావు సభలో పాల్గొంటారు. సంబంధిత ఆహ్వానపత్రికను మంగళవారం సాయంత్రం స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆవిష్కరించారు. డాక్టర్ వెలగా వెంకటప్పయ్య కుమారులు హరిసర్వోత్తమరావు, నాగార్జున, వెంకట్రావు, మానవేంద్ర, ఆదర్శ రైతుసంఘం అధ్యక్షుడు ఈదర పూర్ణచంద్, అయినాల మల్లేశ్వరరావు, పావులూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైభవంగా ఏరువాక పౌర్ణమి

కాజ(మంగళగిరి): మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాజలో మంగళవారం వైభవంగా ఏరువాక పౌర్ణమి కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు అగస్తేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తమ ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లతో వ్యవసాయానికి సిద్ధమై పొలాల్లోకి కోలాహలంగా వెళ్లారు. వెన్నముద్దలను ప్రసాదంగా గ్రామంలోని ప్రజలను పంపిణీ చేశారు.

గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు తీసుకుంటాం

డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ



మాట్లాడుతున్న డాక్టర్ అన్నపూర్ణ

తెనాలిఅర్బన్: గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెనాలి డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ హెచ్చరించారు. పీసీపీఎన్‌డీటి సలహా సంఘ సమావేశాన్ని కొత్తపేటలోని డిప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెనాలి డివిజన్ పరిధిలో ఉన్న స్కానింగ్ సెంటర్‌లను తరచూ తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. ఎవరైనా చట్ట విరుద్ధంగా నిర్ధారణ పరీక్షలు జరిపితే సహించేది లేదన్నారు. ప్రతి స్కానింగ్ సెంటర్‌లో దీనికి సంబంధించిన బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పరిశపోగు సునీల్‌కుమార్, జిల్లా వైద్యశాల వైద్యులు డాక్టర్ వినీల్, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సురేష్, రెడ్‌క్రాస్ సొసైటీ ట్రెజరర్ నాళం శ్రీనునారాయణ, పెనుగొండ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి



అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

తెనాలిఅర్బన్: కార్మికుల పని గంటలను పెంచుతూ ఈ నెల 4న జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉప సంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.బి.ప్రసాద్ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మారీసుపేటలోని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8 గంటల పనిదినాన్ని అంతర్జాతీయ కార్మిక సంస్థ నిర్ణయించదని గుర్తు చేశారు. పని గంటలు పెంచడం వలన కార్మికులు అనేక రకాలుగా ఇబ్బందులు పడే అవకాశం ఉందని చెప్పారు. వెంటనే దానిని ఉపసంహరించుకోవాలని కోరారు. అనంతరం అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు షేక్ హుస్సేన్ వలీ, మంగళగిరి పద్మ, దుర్గా ప్రసాద్, కె.నరసింహా రావు, కోటయ్య, సి.హెచ్.లింగయ్య, టి.సాంబ్రాజ్యం, వి.వీరమ్మ, దార్ల పద్మ, గంజి రమణ, ఎ.బాపయ్య, కోటేశ్వరి, పాములు పాల్గొన్నారు.

●నేడు మహిళా మండలి భవనం ప్రారంభం



స్థానిక కొత్తపేటలోని సరోజినీ దేవి రోడ్డులోని మహిళా మండలి భవనం ఇకపై మెప్మా భవనంగా మారనుంది. సుదీర్ఘ చరిత్ర కలిగిన మహిళా మండలి భవనాన్ని, డాక్టర్ ముద్దన కస్తూరిబాయి అధ్యక్షురాలిగా ఉన్న పాలకవర్గం ప్రభుత్వానికి అప్పగించటం తెలిసిందే. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఆ భవనం నవీకరణ పనులు పూర్తిచేశారు. బుధవారం ఉదయం 10 గంటలకు స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభిస్తారని ఒక ప్రకటనలో తెలియజేశారు. మున్సిపాలిటీలో కొనసాగుతున్న మెప్మా విభాగాన్ని, ఇక్కడకు తరలించి, మహిళా సంబంధిత కార్యక్రమాలను నిర్వహిస్తారు. – తెనాలి

బొల్లిముంత శివరామకృష్ణ సేవలు చిరస్మరణీయం



నివాళులర్పిస్తున్న సర్పంచ్ బండికళ్ళ ప్రసాద్

తెనాలిటౌన్: సినీ రచయిత, అభ్యుదయవాది బొల్లిముంత శివరామకృష్ణ సేవలు ప్రజల గుండెల్లో చిరస్మరణీయమని సర్పంచ్ బండికళ్ళ ప్రసాద్ పేర్కొన్నారు. రూరల్ మండలం కఠెవరం గ్రామంలో మంగళవారం బొల్లిముంత శివరామకృష్ణ వర్ధంతి కార్యక్రమాన్ని ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బండికళ్ళ ప్రసాద్ పాల్గొని శివరామకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి కార్యనిర్వాహక అధ్యక్షులు ఎం.మాణిక్యాలరావు, దేవరపల్లి నీలాంబరం, దేవరపల్లి అభినవ్, అన్వేష్, విజయ, ప్రమీలరాణి, తదితరులు ఉన్నారు.

సత్రం నిర్మాణానికి సహాయం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం పుష్కర ఘాట్ వద్ద కర్మకాండల సత్రం నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే నారా లోకేష్ సొంత నిధులతో మంగళవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నాయకులు మాట్లాడుతూ.. లోకేష్ తన సొంత నిధులు రూ.8 లక్షలు వెచ్చించి కర్మకాండల సత్రం నిర్మాణం చేపట్టారని అన్నారు.

డాక్టర్ జయదేవ్‌కు బంగారు పతకం



తెనాలిరూరల్: విజయవాడకు చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ జయదేవ్ సుదడానికి తెనాలి వైద్యులు బంగారు పతకాన్ని ప్రదానం చేశారు. బోసురోడ్డులోని ఐఎంఏ తెనాలి శాఖ కార్యాలయంలో మంగళవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో పలువురు వైద్యులు పాల్గొన్నారు. డాక్టర్ సీఎస్‌ఆర్‌కే ప్రసాద్ ధార్మిక బంగారు పతకాన్ని అందుకున్న డాక్టర్ జయదేవ్ 'థైరాయిడ్–వైద్యుల దృక్పథం' అన్న అంశంపై ప్రసంగించారు. థైరాయిడ్ సమస్యలు ఉన్న వారికి అందించాల్సి వైద్య విధానం, ఇటీవలి కాలంలో వచ్చిన మార్పుల గురించి వివరించారు. ఐఎంఏ తెనాలి అధ్యక్షుడు డాక్టర్ కె. అనిల్‌కుమార్, డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, డాక్టర్ చందు సాంబశివుడు, డాక్టర్ సీఎస్‌ఆర్‌కే ప్రసాద్, డాక్టర్ మధుప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలి

తెనాలిఅర్బన్: వైద్య ఆరోగ్యశాఖలో జరగనున్న సాధారణ బదిలీలను పారదర్శంగా నిర్వహించాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయు) రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.శ్యామ్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర ప్రభుత్వం గత నెల 15న సాధారణ బదీలలకు అనుమతించిదని గుర్తు చేశారు. దీనిలో భాగంగా గత నెల 31న వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ గైడ్‌లైన్స్ జారీ చేసినట్లు చెప్పారు.

అధిక ఫీజులు వసూలు చేస్తే ఆందోళన చేస్తాం

ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాశం వెంకటేష్



ఆందోళన చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

తెనాలిఅర్బన్: కార్పొరేట్ విద్యాసంస్థల్లో అక్రమంగా ఫీజులు వసూలు చేస్తే ఆందోళన చేస్తామని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాశం వెంకటేష్ హెచ్చరించారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా పట్టణంలోని పలు కార్పొరేట్ విద్యాసంస్థల వద్ద మంగళవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందస్తు అడ్మిషన్ల పేరుతో పలు ప్రవేట్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను దోచుకుంటున్నాయని ఆరోపించారు. అలాంటి వారిపై విద్యాశాఖ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే తక్కువ ధరకు లభించే పుస్తకాలపై కళాశాల పేరును ముద్రించి అధిక రేటుకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఇలా చేయడం వలన పేద విద్యార్థులకు ఆర్థికంగా ఇబ్బంది పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యలపై ఏఐఎస్‌ఎఫ్ నిరంతరం పోరాటాలు చేస్తునే ఉంటుందని తెలిపారు. మద్దినేని కిరణ్‌బాబు మాట్లాడుతూ పేపరు ప్రకటనలకే మంత్రి నారాలోకేష్ పరిమితమయ్యారని ఆరోపించారు. యువగళం పాదయాత్రలో విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చెన్నూరు సాయి, భూమేష్, తేజ, కోట్లు, మణి, దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

నేడు గణేశుడి సన్నిధిలో ఏరువాక పూజలు

కొల్లిపర: మండల పరిధిలోని వల్లభాపురం గ్రామంలోని శ్రీ వినాయక స్వామి దేవాలయంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా బుధవారం ఉదయం 11 గంటలకు గ్రామంలో పంటలు సమృద్ధిగా పండాలని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త అచ్యుత ఇందు శేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరికీ పంటలు బాగా పండాలని, గ్రామం సుభిక్షంగా సుసంపన్నం కావాలని, ఎలాంటి ప్రకృతి అవాంతరాలు లేకుండా, గ్రామంలోని వ్యవసాయ భూములు సారవంతం కావాలని వినాయక స్వామి వారి ని అర్థిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. గ్రామంలోని రైతులంతా దేవాలయం కు విచ్చేసి ఏరువాక ప్రత్యేక పూజలులో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం దేవాలయం ప్రాంగణంలో సాంప్రదాయ, సనాతన, ప్రాచీన విధానంలో వ్యవసాయం చేస్తున్న రైతులనూ, ఆ ఎడ్ల జతలనూ గౌరవిస్తూ సత్కార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు.

దాహం తీరుస్తోంది.. కొంతకాలం ఉంచండయ్యా!

చలివేంద్రం తొలగించాలంటూ అధికారులు హుకుం



నందివెలుగు ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన మేము సైతం చలివేంద్రం

తెనాలిటౌన్: గత 10 సంవత్సరాలుగా వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు నందివెలుగు గ్రామానికి చెందిన మేము సైతం స్వచ్ఛంద సంస్థ సభ్యులు నందివెలుగు ప్రధాన రహదారిపై చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. నందివెలుగు–తెనాలి ప్రధాన రహదారిపై చిరు వ్యాపారాలు అధికమవుతుండటం వల్ల ఆ ప్రాంతంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందని మంత్రి నాదెండ్ల మనోహర్ ఆ ప్రాంతంలో ఆక్రమణలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో అత్తోట దీప్తి ఆ ప్రాంతానికి రెండుస్లారు అక్కడ వారందరితో మాట్లాడి ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు. అయినప్పటికి చిరువ్యాపారులు తమ కార్యకలాపాలు యథేచ్ఛగా చేస్తుండటంతో బుధవారం ప్రధాన రహదారిపై నందివెలుగు జంక్షన్‌లో ఉన్న ఆక్రమణలు తొలగించాలని పంచాయతీ అధికారులను ఎంపీడీవో ఆదేశించారు. ఈ క్రమంలోనే ఎక్కడో మూలన ఉన్న మేము సైతం చలివేంద్రం కూడా తీసివేయాలని అధికారులు తప్పని సరి ఆదేశాలు ఇవ్వడంతో 'మేము సైతం సభ్యులు' చలివేంద్రాన్ని ఇంకొన్ని రోజులు కొనసాగించాలని అభ్యర్థించినా ఫలితం లేకుండా పోయింది. రోహిణికార్తె ఎండలు మండుతున్నాయి. ఆ ప్రాంతంలో గుక్కెడు నీరు త్రాగేందుకు బాటసారులకు, వాహనదారులకు ఎటువంటి సౌకర్యం లేదు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని మరికొన్ని రోజులు బాటసారుల సేవార్థం చలివేంద్రాన్ని కొనసాగించాలని సభ్యులతో పాటు ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. అధికారులు విజ్ఞతతో ఆలోచించి చలివేంద్రం తొలగించే ఆలోచన విరమించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

దంపతులపై మరిది కుటుంబం దాడి

తెనాలిరూరల్: దంపతులపై మరిది అతని కుటుంబ సభ్యులు దాడి చేసి గాయపర్చిన ఘటనపై కేసు మంగళవారం నమోదైంది. పోలీసుల కథనం మేరకు పట్టణ సీఎం కాలనీకి చెందిన మొగిలి కృష్ణ, అతని భార్య గంగపై కృష్ణ తమ్ముడు నాగరాజు, అతని కుటుంబ సభ్యులు పోలేరమ్మ, బాబి ఈ నెల 6వ తేదీన దాడి చేసి గాయపర్చారు. ఆస్తి వివాదం నేపథ్యంలో దాడి జరిగినట్టు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.